సాగు భూమికే రైతుభరోసా ఇవ్వాలి

- పెద్దేముల్ రైతువేదికలో అభిప్రాయాలు వెల్లడించిన రైతులు
- పాల్గొన్న డీసీవో ఈశ్వరయ్య


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య

పెద్దేముల్, జూన్ 29 : వ్యవసాయ భూములను సాగు చేసే రైతులకే రైతు భరోసా ఇవ్వాలని మెజారిటీ రైతులు అభిప్రాయపడుతున్నారని వికారాబాద్ జిల్లా సహకార అధికారి (డీసీవో) ఈశ్వరయ్య, పెద్దేముల్ ఎఫ్ఎస్సీఎస్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుభరోసా పథకం అమలుపై పలు గ్రామాల రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మెజారిటీ రైతులు రైతుభరోసా పథకానికి షరతులను వర్తింపజేయాలని సూచిస్తున్నారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సాగుకు యోగ్యం కాని భూములు, ఫామ్‌హౌస్‌లు, వెంచర్లు, కౌలు రైతులకు ఇవ్వొద్దని పేర్కొంటున్నారన్నారు. అదేవిధంగా రుణమాఫీకి విధించిన కటాఫ్ తేదీని తొలగించాలని.. పంటలు సాగు చేసుకునే సమయానికి ముందే పెట్టుబడి సాయాన్ని అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారన్నారు. అనంతరం ఈశ్వరయ్య, ఇతర అధికారులను పెద్దేముల్ ఎఫ్ఎస్సీఎస్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్ చంద్రయ్య, తాండూరు వ్యవసాయ ఏడీఈ రుద్రమూర్తి, ఏవో నజీరోద్దీన్, డైరెక్టర్లు గెమ్యానాయక్, గోపాల్, పద్మమ్మ, మేనేజర్ మురళీగౌడ్, ప్రవీణ్, పెంటప్ప, ఆయా గ్రామాల రైతులు నరేశ్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, బలరాం, నగేశ్, సాయిబాబా, రాములు, సుదర్శన్ రెడ్డి, బసంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణకు హాజరైన ఆయా గ్రామాల రైతులు

పేదలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి

- శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్
- అనంతగిరి పర్యాటక అభివృద్ధిపై సమీక్ష
- పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ , వివిధ శాఖల అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, చిత్రంలో పక్కన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 29 : పర్యావరణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టే పనులతో పేదలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో అనంతగిరి పర్యాటక అభివృద్ధిపై చేపట్టాల్సిన పనులపై అటవీ, దేవాదాయ, మిషన్ భగీరథ, భూగర్భజలాలు, మున్సిపల్ శాఖల అధికారులతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ .. జిల్లాలో పర్యావరణ పర్యాటక అభివృద్ధికి స్వచ్ఛ దర్శన్ పథకం కింద రూ.110 కోట్ల నిధులు మంజూరయ్యాయని.. వాటితో 213 ఎకరాల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారన్నారు. ఆ పనులతో పేదలకు ఉపాధి అవకాశాలు మెరుగు కావాలన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా చెట్లను ఎక్కువగా తొలగించొద్దన్నారు. గతంలో పర్యాటక అభివృద్ధికి రూ. 225 కోట్లు మంజూరైనా రూ.25 కోట్లతోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవతో కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో పర్యాటకుల సందడి పెరిగిందని.. హైదరాబాద్ నుంచి వికారాబాద్ వరకు రోడ్లకు ఇరువైపులా ఎన్నో హోటళ్లు ఏర్పాటై పేదలకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యాటక రంగాభివృద్ధితో జిల్లాలోని పలు ప్రాంతాలు వృద్ధి చెందుతాయన్నారు. అనంతగిరి ప్రాంత అభివృద్ధితోపాటు కోట్‌పల్లి, సర్సన్‌పల్లి, శివసాగర్, లక్నాపూర్ ప్రాజెక్టులు, దామగుండం ప్రాంతాల అభివృద్ధికి కూడా కృషి చేయాలన్నారు. పర్యావరణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టే వివిధ పనుల వివరాలను ఎల్‌అండ్‌టీ ప్రాజెక్ట్ మేనేజర్ సుమతి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమీక్షలో నీటిపారుదల శాఖ జిల్లా అధికారిణి రేణుక, ఈఈ సుందర్, అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీవైఎస్‌వో హనుమంతరావు, మత్స్య శాఖ అధికారిణి సౌజన్య, దేవాదాయశాఖ అధికారి నరేందర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ పట్టణంలో క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- బాధితులకు పరామర్శ

షాద్‌నగర్, జూన్ 29 : సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి మృతి చెందిన ఒక్కో కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించి మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యజమాని శైలేశ్‌అగర్వాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు హరిగౌడ్, ప్రభాకర్, యాదయ్య, సంతోష్, అంజయ్య, రమేశ్, మాసయ్యగౌడ్, రవీందర్, రాజు, మధు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

పదవీవిరమణ పొందిన కొందుర్గు ఎంపీడీవో ఆంజనేయులును ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఘనంగా సన్మానించారు. కొందుర్గు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పదవీవిరమణ సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని మండలానికి ఆంజనేయులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, నాయకులు రాజేశ్, రామకృష్ణ, శ్రీధర్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి..

సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాలో చేపట్టిన వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజినీర్లు, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ఓ లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వైద్యశాలలో ఓపీడీ, కొత్త బ్లాక్ నిర్మాణ పనులు, సీతాఫల్‌మండీలో 30 పడకల అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కామటిపురలో వంద పడకల వైద్యశాల, చార్మినార్ ప్రభుత్వ నిజామియా కాలేజీ, జనరల్ వైద్యశాలల పునర్నిర్మాణ పునరుద్ధరణ పనులు, గాంధీ ఆస్పత్రిలో శానిటేషన్, యాకుత్‌పురలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బండ్లగూడలో 50 పడకల ఆసుపత్రి తదితర నిర్మాణ పనులపై ఆరా తీశారు. టెండర్ జరగని పనుల్లో త్వరగా ఆ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఎన్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేందర్ రెడ్డి, ఈఈ చలపతిరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

మాదాపూర్‌లోని నాలాను పరిశీలిస్తున్న బల్దియా విజిలెన్స్ కమిషనర్ ఏవీ రంగనాథ్

వరద నీరు నిలవద్దు

సిటీబ్యూరో: వరద నీరు నిలిచే ప్రాంతాలపై దృష్టి పెట్టి, యుద్ధప్రాతిపదికన సమీపంలో ఉండే క్యాచ్ పిట్స్, మ్యాన్ హోల్స్‌ను మెరుగుపరచాలని బల్దియా విజిలెన్స్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలో పర్యటించిన ఆయన మ్యాన్ హోల్స్, వాటర్ లాగింగ్ ఏరియాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మ్యాన్ హోల్స్, క్యాచ్‌మెంట్ పిట్స్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించారు. నగరంలో ఉన్న 140 వాటర్ లాగింగ్ పాయింట్లపై దృష్టి పెట్టిన ఆయన... కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. మాదాపూర్‌లోని వాటర్ లాగింగ్ పాయింట్‌ను పరిశీలించిన ఆయన... వర్షం నీరు ప్రవాహ వేగాన్ని తగ్గించేలా పేరుకుపోయిన చెత్తా, ఇసుక, తొలగించాలని సూచించారు.

మా పంతులును బదిలీ చేయొద్దు

- ట్రాన్స్‌ఫర్ చేస్తే డిప్యుటేషన్‌పై మా ఊరి బడిలోనే కొనసాగించాలి
- వికారాబాద్ కలెక్టర్, డీఈవోలకు వినతిపత్రాలిచ్చిన గ్రామస్తులు

టీచర్‌ను మా ఊరి పాఠశాలలోనే కొనసాగించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మేడిపల్లి కలాన్‌వాసులు

పూడూరు, జూన్ 29 : మా పాఠశాల పంతులును బదిలీ చేయొద్దని.. ఇక్కడే ఉంచాలని స్థానికులు పేర్కొంటున్నారు. ఆయన పాఠశాలను అభివృద్ధి చేయడంతోపాటు పిల్లలకు క్రమశిక్షణతో చదువు చెప్పుతున్నారని.. ఒకవేళ ఆయన్ను ట్రాన్స్‌ఫర్ చేస్తే మళ్లీ మా ఊరి బడిలోనే పాఠాలు చెప్పేలా డిప్యుటేషన్‌పై పంపించాలని కలెక్టర్‌తో సహా డీఈవోకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. మండలంలోని మేడిపల్లి కలాన్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు ఖాజామొహినోద్దీన్ మరో పాఠశాలకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. గతేడాదిలో బదిలీ అయితే స్థానికుల కోరిక మేరకు ఉన్న తాధికారులు బదిలీ చేయకుండా అక్కడే ఉంచారు. ప్రస్తుతం ఆయన వేరే పాఠశాలకు బదిలీ కావడంతో ఖాజా మొహినోద్దీన్‌ను డిప్యుటేషన్‌పై మా ఊరి బడిలోనే ఉంచాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఈవో రేణుకాదేవిలకు గ్రామ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ రవికుమార్, రమేశ్, ఉస్మాన్, మల్లేశం, శశిధర్, షేర్‌ఖాన్, రవి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్, శ్రీకాంత్, భూపాల్, అన్వర్, మోసిన్‌ఖాన్ కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం

రాష్ట్ర ఆయిల్‌పామ్ సలహాదారు వీఎన్‌రావు

షాద్‌నగర్ రూరల్, జూన్ 29 : మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాగులో మార్పులు చేసుకుంటే అధిక లాభాలు పొందొచ్చని రాష్ట్ర ఆయిల్‌పామ్ సలహాదారు వీఎన్ రావు, రంగారెడ్డి జిల్లా హార్టికల్చర్ అధికారి సంజయ్‌కుమార్, హార్టికల్చర్ అధికారిణి ఉషారాణి రైతులకు సూచించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపూర్‌లో ఆయిల్‌పామ్ పంట సాగుపై జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలంటే రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగుచేయాలన్నారు. ఈ పంటను సాగు చేస్తే ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందన్నారు. ఈ పంట సాగులో చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ అధికారి మల్లారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారిణి ప్రియాంక, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ భార్గవ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులు పరిష్కరిస్తాం

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి, జూన్ 29 (నమస్తే తెలంగాణ): పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు సూచించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను రానున్న 10 రోజుల్లో పరిష్కరించాలన్నారు. జూన్ 15 నుంచి జూన్ 28 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన తర్వాతే సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలన్నారు. ఆర్ఎస్ఆర్ లిమిట్, మిస్సింగ్ సర్వేనంబర్లు, సక్సేషన్, మ్యుటేషన్ మొదలగు వివిధ సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకోసం సమీకృత గురుకుల విద్యాసంస్థ ఏర్పాటుకు అనుకూలంగా 20 ఎకరాల స్థలాన్ని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ రెండు వారాల్లో ధరణిలో వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన 3,779 దరఖాస్తులను పరిష్కరించామని, మిగిలిన దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తామన్నారు. చేవెళ్ల, మొయినాబాద్, యాచారం, కందుకూరు, మంచాల, మహేశ్వరం మండలాల్లో ఎక్కువగా పెండింగ్‌లో దరఖాస్తులు ఉన్నాయని వాటి ని కూడా త్వరలోనే పరిష్కారిస్తామని తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ధరణి దరఖాస్తులను.. ఆర్డీవో, తహసీల్దార్ లాగిన్లలోని పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తూ క్లియర్ చేస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భూపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఘన సన్మానం

పదవివీరమణ పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్లను సన్మానించిన వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 29 : ప్రభుత్వ ఉద్యోగులకు పదవి వీరమణ అనేది తప్పదని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. పోలీస్ విభాగంలో సేవలందించి పదవి వీరమణ పొందుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు హతీరామ్, నర్సింహులు, యునుస్‌ను ఆయన ఘనంగా సన్మానించి.. శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. హతీరామ్ 1989లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో, నర్సింహులు 1989లో ఉమ్మడి మెదక్ జిల్లా లో, యునుస్ 1984లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పోలీస్ కానిస్టేబుళ్లుగా బాధ్యతలు చేపట్టి.. సుదీర్ఘకాలం కొనసాగి.. హెడ్ కానిస్టేబుల్‌గా, ఏఎస్ఐగా, ఎస్ఐ లుగా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు కరుణాసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇన్‌స్పెక్టర్లు, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, జూన్ 29 : పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ పాఠశాలల ప్రాంతీయ సమన్వయాధికారిణి శారద ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్, జంతు, వృక్ష, అర్థ, పౌర శాస్త్రాలు బోధించేందుకు.. అదేవిధంగా లైబ్రేరియన్, పీఈటీ, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీ, బీఈడీ, జీఎన్ఎం, బీపీఈడీ, బీఎల్ఐసీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జూలై 3న ఉదయం 9 గంటల నుంచి జరిగే డెమోకు అర్హులు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు.

కుల సంఘాల సహకారంతో దొడ్డి కొమరయ్య సినిమా

సినిమా నిర్మాణానికి చెక్కులు అందజేస్తున్న గోపాల్, రాములు తదితరులు

వికారాబాద్, జూన్ 29 : తెలంగాణ ప్రజల స్వేచ్ఛకోసం అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా దొడ్డి కొమురయ్య సినిమా తీస్తున్నామని దాని దర్శకుడు సేనాపతి తెలిపారు. శనివారం వివేకవాణి విద్యాలయంలో సినిమా నిర్మాణ కమిటీ సమావేశం జరిగింది. అందులో ఆ సినిమాలో నటించేందుకు నటినటులు, డ్యాన్సర్లు, గాయకులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సేనాపతి మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య చిత్రాన్ని అన్ని కుల సంఘాల సహకారంతో నిర్మిస్తున్నామన్నారు. ప్రతి జిల్లా నుంచి 30 మంది సహ నిర్మాతలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. నిర్మాణంలో భాగంగా దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ వికారాబాద్ జిల్లా కమిటీ సహ నిర్మాతల కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జైదుపల్లి గోపాల్, కో-కన్వీనర్ రామన్న మాదిగ మాట్లాడారు. ఈ సందర్భంగా సినిమా నిర్మాణానికి ప్యాట నర్సింహులు, రాములు మాదిగ, జైదుపల్లి గోపాల్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, వివేకావాణి విద్యాలయ కరస్పాండెంట్ నాగయ్య పాల్గొన్నారు.

పారబోస్తున్నా..పట్టించుకోవట్లే..

సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్ అంటేనే ఆధునికతకు మారుపేరు. అలాంటి కారిడార్‌లో ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్ల నిర్వహణపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు హెచ్ఎండీఏ యంత్రాంగం. గచ్చిబౌలి నుంచి నానక్‌రాంగూడ మీదుగా నార్సింగి, మంచిరేవుల వరకు ఉన్న ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ల పక్కన ఖాళీ స్థలాలను డంప్ యార్డుగా మారుతోంది. చుట్టు పక్కల ప్రాంతాల్లో భవన నిర్మాణాలు జోరుగా జరుగుతుండటంతో అక్కడి వ్యర్థాలను తీసుకొచ్చి సర్వీసు రోడ్ల వెంబడి ఉన్న ఖాళీ ప్రాంతాల్లో పడేస్తున్నా.. అడిగే వారే ఉండటం లేదు. గ్రేటర్ చుట్టూ మహానగరానికి మణిహారంలా ఉన్న ఔటర్ రింగు రోడ్డును సమర్థవంతంగా నిర్వహించాల్సిన అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ రోడ్డు నిర్వహణను చూడాల్సిన అధికార యంత్రాంగం ఆఫీసులకే పరిమితమవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో రోడ్లను పరిశీలిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు అటు వైపే కన్నెత్తి చూడటం లేదు.

టర్ రింగు రోడ్డు సర్వీసు రోడ్డు వెంట పారబోసిన భవన నిర్మాణ వ్యర్థాలు

రాత్రి వేళల్లో డంపింగ్...

ఔటర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డు వెంబడి మొక్కలు నాటి సంరక్షించాల్సిన అధికారులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యారు. ఓఆర్ఆర్ నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అలాంటి పనులు చేపట్టడం లేదు. రాత్రి వేళల్లో భారీ నిర్మాణ సైట్ల నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి పారబోస్తున్నారు. అదే సమయంలో మట్టి, కంకరతో పాటు ఇతర నిర్మాణ సామగ్రి ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లపై పడుతోంది. ఈ క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి ఎక్కువగా పడి.. దుమ్ము, ధూళి ఎక్కువగా వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ ఉద్యోగులు గచ్చిబౌలి, రాయిదుర్గం ప్రాంతాల నుంచి ఫైనాన్సియల్ డిస్ట్రిక్, కోకాపేట, నార్సింగి ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లపై వెళ్లాలంటేనే జంకుతున్న పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా హెచ్ఎండీఏ అధికారులు స్పందించి భవన నిర్మాణ వ్యర్థాలను సర్వీసు రోడ్ల వెంట వేయకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కుళ్లిపోయిన గుడ్లు


పులిమామిడి అంగన్‌వాడీ కేంద్రం-2కు ప్రభుత్వం నుంచి వచ్చిన గుడ్లు

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం సరఫరా

- పులిమామిడి కేంద్రం-2లో కుళ్లిపోయిన ఎగ్స్ దర్శనం
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్తుల ఆరోపణ
- ప్రమాదంలో చిన్నారుల ఆరోగ్యం.. ఆందోళనలో పేరెంట్స్

కఠినంగా వ్యవహరిస్తాం

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. తరచూ ఏదో ఒక చోట ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. గతంలో యెల్లకొండ కేంద్రానికి కూడా కుళ్లిపోయిన గుడ్లు రాగా సంబంధిత బాధ్యులకు మెమోలు ఇచ్చాం. తాజాగా పులుమామిడి అంగన్‌వాడీ కేంద్రం-2లో కుళ్లిన గుడ్ల సరఫరా విషయాన్ని సీడీపీవో దృష్టికి తీసుకెళ్తా. ఈసారి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- శాలిని, అంగన్‌వాడీ మండల సూపర్‌వైజర్

నవాబుపేట, జూన్ 29 : పౌష్టికాహారానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు నాసిరకానికి ఆనవాళ్లుగా మారుతున్నాయి. సిబ్బంది నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం అభంశుభం తెలియని చిన్నారుల పాలిట శాపంగా మారుతున్నది. నిరుపేదల చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలనే సద్దుదేశంతో ప్రభుత్వం వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిత్యం గుడ్లు, బాలామృతం, పాలు, అన్నం, పప్పు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నది. అధికారుల ఉదాసీనత, కిందిస్థాయి సిబ్బంది అలసత్వం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నది. దీనికి నిదర్శనం శనివారం నవాబుపేట మండలంలోని పుల్‌మామిడి అంగన్‌వాడీ కేంద్రం-2లో నాసికరం గుడ్లు కనిపించడమే. ఈ విషయమై అక్కడున్న అంగన్‌వా డీ సిబ్బందిని ఆరా తీయగా పై నుంచి రావడమే ఇలా వస్తున్నాయని బదులివ్వడం గమనార్హం. కొన్ని రోజుల కింద యెల్లకొం డ గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో నూ ఇదే పరిస్థితి కనిపించింది. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇలాగే కొనసాగితే తమ పిల్లలు ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లేనని పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పగులగొట్టి చూడగా కుళ్లిపోయిన గుడ్లు